మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన పోలీస్ కమిషనర్



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న పోలీస్ కమిషనర్

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**
ఇటీవల సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.హైమావతిని బుధ వారం జిల్లా పోలీస్ కమిషనర్ అనురాధరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో పాటు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, కమిషనర్ జిల్లాలో శాంతి భద్రతలపై చర్చించుకున్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అడిషనల్ డిసిపి సుభాష్‌చంద్రబోస్, ఎసిపి రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## మంత్రిని సన్మానించిన సెట్విన్ చైర్మన్

**జహీరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన, భూగర్భ ఘనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గడ్డం వివేక్ వెంకటస్వామిని సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్ రెడ్డిని సచివాలయంలో బుధవారం మర్యాద పూర్వంగా కలుసుకుని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రిగా గడ్డం వివేక్ వెంకటస్వామికి బాధ్యతలు అప్పగించిన విషయం విధితమే. కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



వివేక్ వెంకటస్వామిని సన్మానిస్తున్న గిరిధర్‌రెడ్డి



అడిషనల్ కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంటున్న మాజీ సర్పంచ్

## జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో
# 30 వేలకు పైగా దరఖాస్తులు

### సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్

**మర్కుక్, జూన్ 18 (ప్రభాతవార్త):** భూభారతి రెవెన్యూ సదస్సుల్లో జిల్లా వ్యాప్తంగా ఈనెల 17 వరకు రైతుల నుంచి 30,630 దరఖాస్తులు వచ్చినట్లు సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాతూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆయన ఆకస్మికంగా సందర్శించి పలువురు రైతుల నుండి భూ సమస్యల దరఖాస్తులను ఆయన నేరుగా స్వీకరించి వారికి రశీదులను అందజేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 3న ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు ఈనెల 20వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల్లో సాదా బైనామా, మిస్సింగ్ సర్వే నెంబర్లు, అసైన్డ్ భూమికి సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈనెల 20లోపు రెవెన్యూ సదస్సులు పూర్తవుతాయని, అప్పటి వరకు భూ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ అరుణ నర్సింలు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి
### అడిషనల్ కలెక్టర్ గరిమాఅగర్వాల్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

**హుస్నాబాద్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త :** పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్టను పర్యాటక కేంద్రంగా మార్చేందుకు జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం జిల్లా అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ గరీమా అగర్వాల్ పర్యవేక్షించి పరిశీలించారు. జరుగుతున్న పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత పాటించాలని, పనులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్, డిఈ మహేష్, ఏఈ పృద్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### మంత్రిని కలిసిన మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్



వివేక్ వెంకట్ స్వామిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి

**నర్సాపూర్, జూన్ 18, ప్రభాతవార్త:** రాష్ట్ర కార్మిక గనులు, ఉపాధి శాఖల మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకట్‌స్వామిని బుధవారం రాష్ట్ర సచివాలయంలో మెదక్ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ చిలుముల సుహాసినిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు రాష్ట్ర కార్మిక గనుల మరియు ఉపాధి శాఖ మాత్యులుగా గడ్డం వివేక్ వెంకట్ స్వామి ప్రమాణ స్వీకారం చేసి పదవి బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా సచివాలయంలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

### గోవిందరాజ్‌పల్లిలో రెవెన్యూ సదస్సు

**హత్నూర, జూన్ 18 ప్రభాతవార్త :** మండలంలోని గోవిందరాజుపల్లి గ్రామంలో బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించినట్లు డిప్యూటీ తహసీల్దార్ దావుద్ తెలిపారు. రెవెన్యూ సదస్సు సందర్భంగా 46 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు.

### మంత్రిని కలిసిన జిల్లా కలెక్టర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ జోన్ 18, ప్రభాతవార్త :** సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పి.ప్రావీణ్య, బుధవారం వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాని సంగారెడ్డి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సంగారెడ్డి జిల్లాలో ముందుకు తీసుకెళ్లాలా ప్రణాళికలను రూపొందించాలని మంత్రి, జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, రైతు నేస్తం, భూ భారతి చట్టం అమలు, విద్య, వైద్యం, గ్రామీణ అభివృద్ధి, మహిళా సాధికారత, శిశు సంక్షేమపథకాల అమలుకు కృషిచేయాలని మంత్రి, కలెక్టర్‌కు సూచించారు.



వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు బొకే అందజేస్తున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



సిద్దిపేటలో బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్



తెలుగు అనువాద పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సిద్దిపేట కలెక్టర్ హైమావతి

# గ్రామాల్లో ప్రభుత్వ భూముల ప్రొఫైల్ తయారు చేయాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**
జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ గ్రామాలలో వ్యవసాయ భూములతో పాటు ప్రభుత్వ భూములకు సంబంధించి పూర్తి వివరాలతో అధికారులు విలేజ్ ప్రొఫైల్స్ తయారు చేయాలని కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం లోని తడకపల్లి గ్రామ పంచాయతీలో నూతన ఆర్‌వోఆర్ చట్టం - భూ భారతి రెవెన్యూ సదస్సును ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను అధికారులు తగు విచారణ చేసి పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కారమైన వెంటనే ఆన్‌లైన్ చేయాలని సూచించారు. రెవెన్యూ సదస్సులు ఫిర్యాదులు ఇచ్చే బాధితుల పూర్తి వివరాలను తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో తహసీల్దార్ హరికిషన్, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

**మానసిక, శారీరక వికాసానికి పునాతి 'యోగా'**

**సిద్దిపేట రూరల్, జూన్ 18 , ప్రభాతవార్త**
మానసిక, శరీరక వికాసానికి యోగ అనేది పునాది లాంటిదని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. బుధవారం సిద్దిపేట యోగాసన స్పోర్ట్స్ అసోసియోషన్, వ్యాస మహర్షి యోగ సొసైటి భారత్ స్వాభిమాన ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి అంతర్జాతీయ యోగా దినోత్సవంపై చర్చించారు. అనంతరం యోగా సాధనకు ఉపయోగపడే క్యాలెండర్‌తో పాటు పతంజలి యోగా పీఠం ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా రూపొందిచిన తెలుగు అనువాద పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యోగ శిక్షణ అందించడానికి ప్రణాళికలు తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో యోగాసనా స్పోర్ట్స్ అసోసియోషన్ అధ్యక్షులు తోట అశోక్, యోగా అధ్యాయన పరిషత్ సభ్యులు సతీష్, మహర్షి, అరవింద్, శ్రీనివాస్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి,అంజయ్య ఉన్నారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న మహిళా రైతు

## భూ భారతితో సమస్యలు పరిష్కారం

### టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి

**సదాశివపేట, జూన్ 18(ప్రభాతవార్త):** సదాశివపేట మండలం నందికంది, వెల్టూర్ గ్రామాలలో బుధవారం భూభారతి సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరణి వచ్చినప్పటి నుండి రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారన్నారు.మీ సేవా సెంటర్లకు వెళ్లి డబ్బులు చెల్లించి ఎన్నోసార్లు దరఖాస్తులు పెట్టుకున్న సమస్యలు పరిష్కారం కాలేవన్నారు. ప్రజా ప్రభుత్వంలో కార్యాలయాల వద్దకు, మీ సేవా సెంటర్లకు వెళ్లకుండా ఎలాంటి రుసుము చెల్లించకుండా కార్యాలయ సిబ్బంది మీ వద్దకు వచ్చి సమస్యను పరిష్కరిస్తున్నారని అన్నారు.గత కొన్ని సంవత్సరాల నుండి పరిష్కారం కాని సమస్యలు పరిష్కారం అవుతున్నందున రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దన్న, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ కృష్ణ, మార్కెట్ కమిటి డైరెక్టర్లు మగ్గం పటేల్, చింటూగౌడ్, ప్రభు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు గజ్వేల్‌లో రెవెన్యూ సదస్సు

**గజ్వేల్ టౌన్, జూన్ 18 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని ఈనెల 19వ తేదీ గురువారం గజ్వేల్‌లోని ఐఓసి భవనంలో గల సి-బ్లాక్‌లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా గజ్వేల్ శివారు భూములకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని, భూముల సమస్యలు ఉన్న రైతులు సదస్సుకు హాజరై దరఖాస్తులను ఇవ్వాలని తెలిపారు.

### కలెక్టర్‌ను కలిసిన ఎన్ఎస్‌యుఐ నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ జూన్ 18,ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రావిణ్యను బుధవారం సంగారెడ్డి జిల్లా ఎన్ఎస్ యు ఐ మాజీ ప్రధాన కార్యదర్శి వల్లి గారి సాయికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి బోకేనా అందజేశారు.



కలెక్టర్‌ను కలసిన ఎన్ఎస్‌యుఐ నాయకుడు



మంత్రిని వినోద్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

### మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నేతలు

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**
ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జీ మంత్రిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన మంత్రి గడ్డం వివేక్‌ను హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలో సిద్దిపేట కాంగ్రెస్ మాజీ పట్టణ అధ్యక్షులు, చొప్పదండి చంద్రశేఖర్, కౌన్సిలర్లు సాకి ఆనంద్, రియాజ్, సీనియర్ నాయకులు గుండు రవితేజ(లడ్డు) మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించి మంత్రికి శుభాకంక్షలు తెలిపారు.

### జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ జూన్ 18, ప్రభాతవార్త :** సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.ప్రావీణ్య బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవానిచంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. సంగారెడ్డి న్యాయస్థాన సముదాయ భవనంలోని జిల్లా జడ్జి ఛాంబర్లో ప్రధాన న్యాయమూర్తికి పూలమొక్కను అందించారు.ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అమలు చేసే న్యాయ సహాయ కార్యక్రమాలపై ఇరువురు కొద్ది సేపు చర్చించారు.



జిల్లా న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా కలెక్టర్

## పంచాయతీ కార్యదర్శిపై దాడి

### దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

**హత్నూర, జూన్ 18, ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ కార్యదర్శిపై దాడి చేసిన ఘటన హత్నూర మండలం సికింద్లపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శి రవీందర్‌గౌడ్ గ్రామంలోని మురికి కాలువలను శుభ్రం చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన కే వెంకటేష్ పారిశుధ్య సిబ్బందిపై అసభ్యంగా మాట్లాడాడని, ప్రశ్నించిన తనపై చేయి చేసుకున్నాడని పంచాయతీ కార్యదర్శి రవీందర్‌గౌడ్ తెలిపారు. జరిగిన ఘటనపై హత్నూర పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హత్నూర ఎస్ఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు.

# పంచాయతీ కార్యదర్శులకు భారంగా మారుతున్న యాప్‌లు

**సంగారెడ్డి మున్సిపాలిటీ జూన్ 18, ప్రభాతవార్త:**
సర్పంచుల పదవీకాలం ముగియడంతో, గ్రామాల్లో సమస్యల పరిష్కారంలో ప్రత్యేక అధికారులతో పాటు, పంచాయతీ కార్యదర్శి ప్రధాన భూమిక వహిస్తున్నారు. అందుబాటులో పంచాయతీ కార్యదర్శులు ఉండటంతో వారిపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుంది. సర్పంచులు ఉంటే అంతగా పని ఒత్తిడి కార్యదర్శులపై ఉండదు. గ్రామంలో ముందుగా ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉన్న పంచాయతీ కార్యదర్శిని అడగడం సర్వసాధారణమైంది. 2024 జనవరి 31న సర్పంచుల పదవీ కాలం ముగిసింది. ఫిబ్రవరి 2 నుండి గ్రామ పంచాయతీలన్నీ ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లాయి. ప్రభుత్వం నుండి నిధులు రాక కార్యదర్శులు సొంత డబ్బులు ఖర్చు పెట్టి గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికీ కార్యదర్శులు గ్రామాల్లో రోజు పనులు నిర్వహిస్తూ పర్యవేక్షిస్తున్నారు. ప్రతి పనిని యాప్‌లలో నమోదుచేస్తున్నారు. వివరాలను యాప్‌లలో నమోదు చేయడంతోనే సమయం సరిపోతుందని, తిరిగి ప్రభుత్వం పారిశుధ్య పనులకు సంబంధించి డిఎస్ఆర్ యాప్ ప్రవేశపెట్టి వివరాలు నమోదు చేయాలని ఆదేశించడంతో పంచాయతీ కార్యదర్శులు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో పనులు తలకుమించిన భారంగా తయారయ్యాయని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతనెల 24న డిఎస్ఆర్ యాప్‌లో నివేదికను రోజువారీగా నమోదు చేయాలని కొత్తగా మార్గదర్శకాలు విడుదల చేశారు.

కొత్త యాప్‌లు ప్రవేశ పెట్టి వివిధ రకాల పనులు నమోదు చేయాలంటే తలకు మించిన భారంగా వరిణమించిందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ప్రభుత్వ వథకాలకు సంబంధించి నివేదికలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు పంపుతున్నామని,ఒకవైపు ఉన్న యాప్‌లలో వివరాల నమోదు మరోవైపు నివేదికలు పంపడం కష్టంగా మారిన తరుణంలో కొత్త యాప్ ప్రవేశపెట్టి పారి శుధ్య పనులు నమోదు చేయాలని ఆదేశించడం ఎంత మేరకు సమంజసమని పలువురు కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు.

డిఎస్ఆర్‌యాప్‌లో ప్రతిరోజు గ్రామా ల్లో ఎన్ని గృహాల నుంచి చెత్త సేకరిస్తున్నారు నమోదు చేయాలి. అంతేకాకుండా తడి, పొడి చెత్త ఎంత పరిమాణంలో సేకరించారనేది పొందుపర చాలి. ప్రతి ఇంటికి సంబంధించి చెత్త వివరాలు నమోదు చేయాలి.

ఇదే పనిచేసుకుంటూ వెళ్తే మిగి లిన పనులు ముందుకు ఎలా వెళ్తాయని కార్యద ర్శులు అంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పంచా యతీ కార్యదర్శులు ఒటరు జాబితా సర్వే, ఇంది రమ్మ గృహాలు, ఆహార భద్రత కార్డులు, అర్బ్ఘ్యూ ఎస్, మిషన్ భగీరథ. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలకు సంబంధించి వివరాలను 10 రకాల యాప్ లలో నమోదు చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు.

'వార్త' ప్రభావం...

## ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై విద్యాశాఖ నజర్

### విచారణకు ఆదేశించిన ఎంఇవో మనీల
### మూడు పాఠశాలలకు షోకాజ్ నోటీసులు

**హుస్నాబాద్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త :** హుస్నాబాద్‌లోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు నజర్ పెట్టారు. బుధవారం 'ప్రభాతవార్త'లో ప్రచురితమైన 'విద్యార్థులపై ఫీజుల భారం, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీ' శీర్షికలతో వార్త ప్రచురితం కాగా ఈ వార్తకు మండల విద్యాశాఖ అధికారి బండారి మనీల స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలైన శ్రీచైతన్య ఈ టెక్నో ఇంగ్లీష్ మీడియం పాఠశాలతోపాటు మాంటిస్సోరి (కృష్ణవేణి) ఇంగ్లీష్ మీడియం పాఠశాలతోపాటు మరో ప్రైవేట్ పాఠశాలకు షోకాజ్ నోటీసులు అందించినట్లు చెప్పారు. హుస్నాబాద్‌లోని ప్రైవేట్ పాఠశాలలలో ఫీజుల విషయంతోపాటు పుస్తకాల విక్రయాల విషయంలో వారిపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపడంతో పాటు ఇచ్చిన షోకాజ్ నోటీసుకు వారు ఎలాంటి సమాధానం అందిస్తారో చూసి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిచే ప్రతీ పాఠశాలపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు.విద్యార్థుల తల్లితండ్రులను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తే వారిపై ఫిర్యాదు చేయాలని వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఫిర్యాదు చేసిన పేర్లు బయటకు రాకుండా చూసుకుంటామని విద్యాశాఖ అధికారి బండారి మనీల తెలిపారు.

### 20 వరకు రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ

*అల్లాదుర్గం, జూన్ 18, ప్రభాతవార్త:* ఈ నెల 20వ తారీఖు వరకు రైతులు రైతు భరోసా కొరకు ధరఖాస్తులు చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి రాజేష్ కుమార్ తెలిపారు. 2025 వానకాలం రైతు భరోసా కొరకు జూన్ 6వ తేదీ లోపు పట్టాపాసుపుస్తకం అందుకున్న రైతులు ఎకరానికి 6వేల రూపాయల చొప్పున పెట్టుబడి సహాయం అందుకునేందుకు ధరఖాస్తులు చేసుకునేందుకు అర్హులన్నారు. రైతులు తమ పట్టాపాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం జిరాక్సు పత్రాలతో ధరఖాస్తులను భర్తీ చేసి క్లస్టర్ ఏఈఓలకు అందచేయాలన్నారు. మండలంలో 366 మంది రైతులు కొత్తగా పట్టాపాసుపుస్తకం అందుకున్నారని, అందులో 126 మంది రైతులు మాత్రమే రైతు భీమా కొరకు ధరఖాస్తులు చేసుకున్నారన్నారు. 240 మంది వెంటనే రైతు భీమా కొరకు ధరఖాస్తులు చేసుకుని పథకంలో లబ్దిపొందాలని రాజేష్ కుమార్ మండల రైతులకు సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**రామాయంపేట, జూన్ 18, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందిన ఘటన రామాయంపేట మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మున్సిపాలిటీకి చెందిన దేవుని రాజేందర్ మంగళవారం రాత్రి అత్తగారిల్లు సుతార్‌పల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అకస్మాత్తుగా రామాయంపేట తండా సమీపంలో అడవి పంది అడ్డు రావడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో దేవుని రాజేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. బంధువులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### టెలిగ్రామ్ లింకుతో
### రూ. 2.26 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

**శివ్వంపేట, జూన్ 18, ప్రభాతవార్త :** టెలిగ్రామ్ లింకుతో యువకుడు డబ్బులు పోగొట్టుకున్న ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మధుకర్‌రెడ్డి కథనం ప్రకారం... మండలంలోని ఎద్దుల్లాపూర్ గ్రామానికి చెందిన మేకల చంద్రశేఖర్‌రెడ్డి టెలిగ్రామ్ లింక్ వచ్చిందని దానితో రూ. 500 పెడితే రెండింతలు వస్తాయని నమ్మి కొద్ది కొద్దిగా డబ్బులు పెట్టగా మొత్తం 2 లక్షల 26 వేల రూపాయలు పోగొట్టుకున్నాడని తెలిపారు. మోసపోయానని గ్రహించి మేకల చంద్రశేఖర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎటువంటి టెలిగ్రామ్ లింకులు ఓపెన్ చేయొద్దని, ఓటిపిలు చెప్పొద్దని ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.

### వివాహిత అదృశ్యం

**జహీరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** విద్యా సంవత్సరం ఆరంభం అవుతున్నందున కుమారుడికి స్కూల్ యూనిఫాం, పుస్తకాలు కొనేందుకు ఈ నెల 9న మండలంలోని హుగ్గెల్లి గ్రామానికి చెందిన వివాహిత నాగరాణి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని రూరల్ ఎస్ఐ ఎం కాశీనాథ్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బంధువులు, సన్నిహితుల వద్ద నాగరాణి ఆచూకి కోసం గాలించినా ప్రయోజనంలేకపోవడంతో తండ్రి బోయిన అంజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కాశీనాథ్ తెలిపారు.

### బైండోవర్ ఉల్లంఘన కేసులో వ్యక్తికి జరిమానా

**హుస్నాబాద్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త :** పట్టణంలోని కవిత ట్రేడర్స్ యజమాని చెప్యాల వెంకటేష్ గతంలో గుడుంబా తయారు చేసేందుకు బెల్లం విక్రయిస్తూ పట్టుబడగా ఆయనను తహసీల్దార్ ముందు బైండోవర్ చేయగా మళ్లీ అమ్మను అని చెప్పి ఇటీవల గుడుంబా తయారీకి బెల్లం పట్టికలు సరఫరా చేస్తూ స్టేషన్ ఘన్‌పూర్ పరిధిలో పట్టుపడగా హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో(8 టన్నుల) బెల్లం కేసులో నిందితుడిగా ఉండి బైండోవర్ ఉల్లంఘించిన కారణంగా వెంకటేష్‌కు హుస్నాబాద్ తహసీల్దార్ లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు రూ 50వేలు జరిమానా విధించి అతనికి రశీదు అందించినట్లు ఎక్సైజ్ సిఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ స్టేషన్ పరిధిలో ఎవరైనా గుడుంబా తయారీ, తయారీకి బెల్లం సరఫరా, గుడుంబా విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రూప, దామోదర్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

### ఎండు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**చిన్నశంకరంపేట, జూన్ 18,ప్రభాతవార్త:** ఎండు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు రామాయంపేట ఆబ్కారి సిఐ నరేందర్ తెలిపారు. మంగళవారం నమ్మదగిన సమాచారంమేరకు చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్ శివారులోని కావేరి పరిశ్రమ కార్మికుల గదిలో ఆబ్కారి సిఐ నరేందర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి బిహార్ రాష్ట్రానికి చెందిన రాజు దేవ్‌సింగ్‌ను అదుపులోకి తీసుకుని 272 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. రాజుదేవ్ సింగ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా అక్రమంగా గంజాయిని క్రయవిక్రయాలు జరిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



నిందితుడితో అబ్కారి పోలీసులు

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

### -డిప్యూటీ కమిషనర్ రవికుమార్



**అత్తాపూర్ జూన్ 18,ప్రభాతవార్త :** సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ సూచించారు. వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ నదుల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై బుద్వేల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల ద్వారా సంక్రమించే వ్యాధులు, వాటి నివారణ చర్యలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలను నివారించవచ్చని సూచించారు. దోమల ద్వారా అనేక వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చిత్త వేయకుండా చెత్త సేకరించే ఆటోలకు మాత్రమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజిస్ట్ శ్రీనివాస్, ఏఈ ఉదయ్ కుమార్, ఎంటమాలజీ సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**అత్తాపూర్ జూన్ 18,ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని బిజెపి నేతలు పేర్కొన్నారు. బిజెపి రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం శివారంపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయం ,ఆరంఘర్ దగ్గర మొక్కలు బిజెపి నేతలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ....భవి తరాల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ 11ఏళ్ల పాలనలో దేశం ఎంతో పురోగతి సాధించిందని పేదలకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, బొక్క బాల్ రెడ్డి, సత్యనారాయణ ముదిరాజ్, హరి కిషన్ జి, సోల్కర్ రెడ్డి, వి.జగన్, శ్రీకాంత్ రెడ్డి, కోరాని క్రాంతి, బాబు రావు, బండారి బాల కృష్ణ, రజిని కాంత్, మల్లేష్ చారి, వెంకటేష్ సురేందర్, తిరు మలేష్, రాకేష గౌడ్, యాదయ్య, కవిత, రమాకాంత్ ,గణేష్, తుంగ ఇంద్ర రెడ్డి ,సరిత రెడ్డి ,రాజశేఖరరెడ్డి, పవన్ ,శ్రీనివాస్ రెడ్డి, పి వంశీ ,రాజు నాయక్ మరియు నాయకులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన బిజెపి నేతలు



**అత్తాపూర్ జూన్ 18,ప్రభాతవార్త :**
భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పలువురు బిజెపి నాయకులు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు అత్తాపూర్ డివిజన్ లో అమ్మకు ఒక చెట్టు అనే నినాదంతో డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో బిజెపి నేతలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ మల్లారెడ్డి జిల్లా సెక్రెటరీ కొమరయ్య అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్ విజయ్ కుమార్ కిరణ్ చారి జయానంద రెడ్డి ఆర్ జగన్ జి రాజు పి వెంకట్ రెడ్డి శశికాంత్ శర్మ విజయ స్వామి నరేశ్ గురుప్రీత్ యాదగిరిరెడ్డి ప్రవీణ్ రాం బాబు ఓంకార్ తదితరులు పాల్గొన్నారు

## మానసిక ప్రశాంతత, ఆరోగ్యాన్ని పెంచేందుకు యోగా దోహదం : మాధవరం కాంతారావు

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 18, ప్రభాతవార్త**
ప్రస్తుత సమాజంలో యాంత్రికమైన జీవనశైలితో ప్రతిఒక్కరూ ఒత్తిళ్ళకు గురవుతున్నారనీ మానసిక ప్రశాంతత, శారీరక పటుత్వం పెంచేందుకు యోగా దోహదపడుతుందని కూకట్పల్లి స్వచ్ఛభారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు పేర్కొన్నారు. 2025లో అంతర్జాతీయ యోగా దినోత్సవం యొక్క థీమ్ యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ ఉంటుందని యోగా ద్వారా మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను, భారతీయుల జీవిన విధానాన్ని ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకొచ్చిందనీ భారత ప్రధాని నరేంద్ర మోడీ స్పూర్తితో ప్రతి సంవత్సరం కూకట్పల్లి స్వ ఛభారత్ అభియాన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యోగా వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం జూన్ 21, ఉదయం 6 గంటలకు, కూకట్పల్లి ఎన్.కే.ఎన్.ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే అంతర్జాతీయ యోగా వేడుకలకు ఆరోగ్యాభిలాషులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కాంతారావు విజ్ఞప్తి చేశారు.

### ముగ్గుల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళా ఉద్యోగులు



నార్సింగి మున్సిపల్ కార్యాలయం ముందు మహిళా ఉద్యోగులు, సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

**నార్సింగి, జూన్ 18 ప్రభాతవార్త :** వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం నార్సింగి మున్సిపల్ భవనం ముందు మహిళా ఉద్యోగులు, సిబ్బందికి "ముగ్గుల పోటీలు" నిర్వహించారు. కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు టిపిఓ మణిహారిక ముగ్గుల పోటీల న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సెప్టెంబర్ 10.వ,తేదీన సత్కారం, జ్ఞాపికలు అందజేస్తారు. ఈ ముగ్గుల పోటీల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని పోటాపోటీగా ముగ్గులు వేశారు. స్వరూప, కవిత, జోత్స్న, సుశ్మ, శిరీష, అనూష, రాణి, రాజశ్రీ, మీనాక్షమ్మ, రమాదేవి, జ్యోతి, మంజూల తదితరులు ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్లాస్టిక్ నిషేదం, పర్యావరణ పరిరక్షణ, తడి,పొడి చెత్త వేరు చేయడంపై విద్యార్థులకు వ్యాసరచన, పేయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సైతం 100.రోజుల ప్రణాళిక ముగింపు రోజు సర్టిఫికెట్లు అందజేసి, అభినందించనున్నట్లు టిపిఓ మణిహారిక వివరించారు.

## రోడ్డు డివైడర్ మధ్యలో సుందరీకరణ పనులు చేపట్టాలి

### -పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ



పనులను పరిశీలిస్తున్న అరికెపూడి గాంధీ

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 18, ప్రభాతవార్త**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, డీసీ గంగాధర్, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, పారిశుధ్య విభాగం అధికారులతో కలిసి పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజుల రామరం వెళ్లే రోడ్డు వయా ఎల్లమ్మబండ రోడ్డు నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగిందని చెప్పారు. ఉషముళ్ళపూడి కమాన్ నుండి 100ఫీట్ రోడ్డు విస్తరణలో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి, ప్రణాళికను రూపొందించి రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. యుద్ధప్రాతిపదికన రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, రోడ్డు విభాగిని పనులు నాణ్యత ప్రమాణాలుతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రోడ్డు డివైడర్ మధ్యలో సుందరికరణ పనులు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానార్ గణపతి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు గోవర్ధన్ రాజీవ్, శ్రావణి, నిఖిల్, వర్క్ ఇన్స్పెక్టర్లు మహదేవ్, రవి కుమార్, గురువా రెడ్డి, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులు జనప్రియ, దయ నంద్, లైన్స్ మధుకర్, కరణ్ కుమార్, స్ట్రీట్ లైట్స్ స్వప్న శ్రీనివాస్, నాయక్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రణాళిక బద్ధంగా బండ్లగూడను అభివృద్ధి చేస్తున్నా : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



బండ్లగూడ కార్పోరేషన్‌లో అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు.

**నార్సింగి, జూన్ 18 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌ను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కార్పోరేషన్ పరిధిలోని 12,17,18,19,20. 22.డివిజన్ల పరిధుల్లో రూ.7.కోట్ల 44.లక్షల నిధులతో భూగర్భ డ్రైనేజి, సీసీ రోడ్డు పనులకు కమీషనర్ శరత్ చంద్ర, మాజీ మేయర్ బి.మహేందర్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు పెద్ద ఎత్తున నిదులు వెచ్చిస్తున్నామన్నారు. గతంలో డ్రైనేజి వ్యవస్థ అస్థవ్యస్థంగా ఉండేదని, దీంతో వర్షాకాలం వస్తే ఎక్కడికక్కడా మ్యాన్‌హోళ్లు పొంగి పొర్లేవని, వేసవిలో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడే వారన్నారు. ప్రణాళిక బద్దంగా పని చేస్తూ, భూగర్భ డ్రైనేజి వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించామని, మంచినీటి సమస్య రాకుండా జల మండలి ఉన్నతాధికారులతో మాట్లాడి నీటి క్వాంటిటీని పెంచుకోవడం జరిగిందన్నారు. పార్కులు, ఓపెన్ జిమ్‌లు, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్డు పనులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. అధికారులు చక్కగా పని చేస్తున్నారని, వారికి నాయకులు, ప్రజలు సహకరించి అభివృద్ధిని మరింత వేగంగా చేయించుకోవాలన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయం చేద్దామని, ఇప్పుడు కుల, మత,పార్టీలకు అతీతంగా అభివృద్ధిని చేసుకుందామని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి, మాజీ కార్పోరేటర్లు సా గర్‌గౌడ్, శ్రీలత సురేష్‌గౌడ్, నాయకులు ఆంజనేయులు, పాపయ్యయాదవ్, గోపాల్, నవీన్, శ్రీనివాస్, రాంప్రసాద్, నరేష్, సుమన్‌గౌడ్, హరీష్‌గౌడ్, విష్ణు పాల్గొన్నారు.

## కెపిహెచ్‌బి కాలనీ గృహ సముదాయాల రిజిస్ట్రేషన్లు చేయాలని బండి రమేష్ వినతి



మంత్రి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బండి రమేష్

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 18, ప్రభాతవార్త**
నియోజకవర్గ సమస్యల పరిష్కార కోసమై టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ రెవెన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ బోర్డ్ ఎండి గౌతమ్‌ను బుధవారం వారి కార్యాలయాల్లో కలిశారు. ప్రధానంగా నియోజకవర్గ పరిధిలోని కెపిహెచ్బి కాలనీ గృహ సముదాయాల రిజిస్ట్రేషన్లు ఎప్పటినుంచో పెండింగ్ ఉండడాన్ని రమేష్ వారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్థానిక నివాసుల సౌకర్యార్థం వాటిని రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం హై లెవెల్ కమిటీని నియమించాలని వారిని బండి రమేష్ కోరారు. హౌసింగ్ బోర్డు ఇళ్ళు లబ్ధిదారులకు కేటాయించి సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ రిజిస్ట్రేషన్స్ కాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దాదాపు 630 అల్పాదాయా వర్గాల గృహాలతోపాటు, 270 సంపూర్ణ గృహాలు హిందూ ప్రాజెక్టులోని విల్లాలు, ఫ్లాట్స్, మంజీరా ఫ్లాట్స్ కేవలం చిన్న చిన్న కారణాలతో రిజిస్ట్రేషన్స్ ఆగిపోయాయన్నారు. అలాగే జేఎన్టీయూ పక్కన ఉన్న సాయి నగర్ ఫ్లాట్స్ రిజిస్ట్రేషన్ చిడ్కో ప్రాజెక్ట్ విషయంలోనూ త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ మేరకు వారికి బండి రమేష్ వినతిపత్రం సమర్పించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు తగు సూచనలు ఇచ్చినట్లు బండి రమేష్ పేర్కొన్నారు.

## కమిషనర్ వెంకట్రావు పదవీ కాలాన్ని పొడిగించాలని అర్చక జెఎసి విజ్ఞప్తి



దేవాదాయ శాఖ కమీషనర్ ఎస్.వెంకట్రావును సన్మానించిన అర్చకులు

**గన్‌ఫౌండ్రి, జూన్ 18ప్రభాతవార్త:** అతి స్వల్ప కాలంలో పెండింగ్‌లో ఉన్న అనేక ఫైళ్లను పరిష్కరించడం, జిల్లా వారిగా అర్చక వెల్ఫేర్ బోర్డు పథకాలపై అవగాహన సదస్సులు నిర్వహించడంతోపాటు పెండింగ్‌లోఉన్న సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని కమీషనర్ ఎస్. వెంకట్రావు అన్నారు. ఈమేరకు దేవాదాయశాఖ కమీషనర్ ఎస్.వెంకట్రావును అర్చక ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిశారు. జెఎసి చైర్మన్ గంగుఉపేంద్రశర్మ, కన్వీనర్ పరాశరం రవీంద్రచార్యులు, కాందూరి కృష్ణమాచార్యులు, కార్యనిర్వాహక అధ్యక్షులు అగ్నిహోత్ర చంద్రశేఖర్, ఇతర జెఎసి నాయకులు, అర్చకులు, ఉద్యోగులు కలిశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కమీషనర్ ఎస్.వెంకట్రావు పదవి విరమణ ఆగస్టు 2025న పదవి విరమణ చేయనున్నట్లు తెలిపారు. అందుకు కమీషనర్ వెంకట్రావు పదవి కాలం పొడగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పదవి కాలని మరో రెండు సంవత్సరాల పాటు పొడిగించాలన్నారు. సమర్దులైన అధికారిని కొనసాగిస్తే దేవాదాయశాఖ తెలంగాణకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అంతేకాకుండా కాందూరి కృష్ణమాచార్యులు స్వయంగా చిత్రకటించిన కమీషనర్ చిత్రపటాన్ని అందచేశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అర్చక వెల్ఫేర్ బోర్డు లబ్దిదారులకు త్వరలో పరిష్కరించేందుకుగాను మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్య ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. ఈకార్యక్రమంలోతదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్లకు వ్యతిరేకంగా తెచ్చిన చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి

### -ప్రధానికి లక్షలాది సంతకాలతో వినతిపత్రాలను పంపుతాం
### -తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ సర్వసభ్య సమావేశం నిర్ణయం



తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ సర్వసభ్య సమావేశం బుధవారం చైర్మన్ కె.లక్ష్మయ్యకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కొక్కుల దేవేందర్

**హైదరాబాద్, జూన్ 18 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ సర్వసభ్య సమావేశం బుధవారం చైర్మన్ కె.లక్ష్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో పెన్షనర్లు ఎదుర్కొటున్న సమస్యలతో పాటు ఇతర అంశాలను చర్చించారు. కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు వ్యతిరేకంగా తెచ్చిన చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ ఈ నెల 23న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లక్షలాది పెన్షనర్ల సంతకాలతో వినతిపత్రాలను పంపే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో జేఏసీ సెక్రటరీ జనరల్ తులసీ సత్యనారాయణ, తెలంగాణ విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొక్కుల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పెన్షనర్లకు సంబంధించి వినతి పత్రాన్ని సమర్పించారు

## ఎమ్మెల్యే గోపీనాథ్ సేవలు మరువలేనివి

### -నివాళులర్పించిన పలువురు నేతలు



దివంగత నేత మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న పలువురు నేతలు

**శేరిలింగంపల్లి, జూన్18 ప్రభాతవార్త**
జూబ్లిహిల్స్ శాసనసభ్యులు, దివంగత నేత మాగంటి గోపీనాథ్ సేవలు మరువలేనివని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. స్వర్గీయ గోపీనాథ్ దశదినకర్మ కార్యక్రమాన్ని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌కుమార్, కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్ తదితరులు గోపీనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. దివంగత మాగంటి గోపీనాథ్ అకాల మరణం అత్యంత బాధాకరమని, అనారోగ్యంతో ఆయన మరణించారన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఆయన లేనిలోటు తీర్చలేనిదన్నారు. మాగంటి కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృధుస్వభావి, సౌమ్యుడు, రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చిన వారి జీవితం ఎంతో మందికి ఆదర్శమన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి జూబ్లిహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి నిత్యం ఎనలేని కృషిచేశారని గుర్తుచేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ పలువురు నాయకకులు తమ ప్రగాఢ సానుభూతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, పాతూరి వెంకట్రావు, సాంబశివరావు, విజయ్‌కృష్ణ పాల్గొన్నారు.

## కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం



**అత్తాపూర్ జూన్ 18,ప్రభాతవార్త :** శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం హైదరాబాద్, అంతర్జాతీయ విద్యా సహకారాన్ని పెంపొందించే దిశగా ఒక ముఖ్యమైన అడుగు వేసింది, ఇది యూఎస్ఏ లోని కాన్సాస్‌లోని మాన్‌హట్టన్‌లో ఉన్న కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీ ( కె ఎస్ యూ) తో ఒక అవగాహన ఒప్పందం పై సంతకం చేసింది. ఈ భాగస్వామ్యం ఉద్యాన మరియు వ్యవసాయ శాస్త్ర రంగాలపై ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయం యొక్క విద్యా, పరిశోధన మరియు సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ద్వైపాక్షిక ఒప్పందం పరస్పర నైపుణ్యం, ఆవిష్కరణ మరియు సంస్థాగత సామర్థ్య నిర్మాణానికి మార్గం చేయాలని గౌరవ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి అన్నారు. ఈ సహకారం యొక్క ముఖ్య లక్ష్యాలు ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టుల కోసం, విద్యార్థులు అధ్యాపకుల, శాస్త్రవేత్తల మార్పిడి, అతిథి ఉపన్యాసాలు, స్వల్పకాలిక విద్యా సందర్శనల కోసం మరియు అంతర్జాతీయ సమావేశాలు, సింపోజియాలు మరియు బోధనా కార్యక్రమాలలో పాల్గొనడం. ఈ అవగాహన ఒప్పందం ద్వారా రెండు విశ్వవిద్యాలయాలు సహకార పరిశోధన కోసం భవిష్యత్తులో నిర్దిష్ట ఒప్పందాలను చర్చించి, విద్యా వృద్ధి, ఆవిష్కరణ మరియు స్థిరమైన అభివృద్ధికి కొత్త మార్గాలను రూపొందించాలని డాక్టర్ రాజి రెడ్డి గారు అన్నారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్, కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీ, పి.వి. వర ప్రసాద్, విశ్వవిద్యాలయ విశిష్ట ప్రొఫెసర్, మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రఘువర్ధన్ రెడ్డి, డీన్ ఆఫ్ హార్టికల్చర్ మరియు డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ చీనా నాయక్, యూనివర్సిటీ కన్సల్టెంట్ కె. వీరాంజనేయులు, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ మరియు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్ శ్రీనివాసన్, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్స్ డాక్టర్ పి ప్రశాంత్, డాక్టర్ పిడిగం సైదయ్య మరియు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆటోల పర్మిట్లను అడ్డుకుంటే ఫైనాన్సియర్ల తాటతీస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న బి.వెంకటేశం

**సైఫాబాద్, జూన్ 18 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే ఉచిత ఆటో పర్మిట్లను ప్రైవేటు ఆటో ఫైనాన్సియర్లు అడ్డుకుంటే తాటతీస్తామని తెలంగాణ ఆటోరిక్షా డ్రైవర్స్ సంఘాల జెఏసి హెచ్చరించింది. వడ్డీ రాబందువులైన ఆటో ఫైనాన్సియర్లు తమ అక్రమ వ్యాపారంతో ఆటో డ్రైవర్లను నిలువు దోపిడి చేసేందుకే పర్మిట్లను అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని జెఏసి నాయకులు ఆరోపించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఏసి కన్వీనర్ బి.వెంకటేశం, నాయకులు వి.మారయ్య, అజయ్‌బాబు తదితరులు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఫైనాన్సియర్ల అరాచకాలు కొనసాగిస్తూనే ఉన్నారని, కాలం చెల్లిన ఆటోలను తుక్కుగా మార్చి ఆ పర్మిట్లపై కొత్త ఆటోలను కొనుగోలు చేస్తూ ఆర్‌బిఐ నిబంధనలను ఉల్లంఘిస్తూ కోట్ల మేరకు అక్రమంగా వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. వేల ఆటోల పర్మిట్లు ఫైనాన్సియర్ల వద్ద ఉన్నాయని, ఫైనాన్స్ సంస్థల నుంచి అప్పులు తీసుకుని ఆటోలను కొనుగోలు చేసిన డ్రైవర్లు కిస్తులు చెల్లించలేకపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగాన్ని రూపుమాపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఉచిత ఆటో పర్మిట్లను జారీ చేయనున్నదని, దీంతో తమ అక్రమ వ్యాపారం జరగదని భావించిన ఆటో ఫైనాన్సియర్లు జీవోను అడ్డుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ ప్రయత్నాలను ఆపకుంటే వారి కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

## కోడెల సంరక్షణకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళిక రూపొందించాలి

### టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

**ముషీరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:**
వేములవాడ రాజరాజేశ్వర దేవాలయంలో కోడెల సంరక్షణకై శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళిక రూపొందించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోడెల రాజన్న స్వామికి కోడె మొక్కు చెల్లిస్తే కోర్కెలు తీరుతాయని భక్తులు నమ్ముతూ ఉంటారని గుర్తు చేశారు. ఈ కోడెలతో కోట్లాది రూపాయల ఆదాయం ఆలయానికి వస్తున్నప్పటికీ కోడెల సంరక్షణ విషయంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటం విచారకరమని అన్నారు. వారం రోజుల వ్యవధిలో దాదాపు పదిహేనుకుపైగా కోడెలు మృత్యువాత పడినా, ఆలయ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా పూడ్చి పెట్టటం జరుగుతోందని ఆరోపించారు. దేవాదాయ శాఖా మంత్రి కానీ, ముఖ్యమంత్రి కానీ దీనిపై స్పందించకపోవటం దారుణమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం బీసీ రిజర్వేషన్లు ప్రకటించిన తరువాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామాభివృద్ధి కోసం మాజీ సర్పంచులు చేసిన బిల్లుల బకాయిలు అధికారంలోకి రాగానే చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులను ఆదుకోకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. తక్షణమే సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, బిల్లులు చెల్లించిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

### యోగ సాధన ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి



యోగ శిబిరంలో పాల్గొన్న డాక్టర్ కళావతి

**హైదరాబాద్, జూన్ 18 ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నల్లకుంటలోని టిమ్రిస్‌లో విద్యార్థులకు శిక్షణా శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ హోమియో ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ కళావతి మాట్లాడుతూ ప్రతిరోజు యోగ సాధన చేయడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని చెప్పారు. విద్యార్థులు చిన్నతనం నుంచే యోగాపై అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ వాణిశ్రీ, యోగా ఇన్‌స్ట్రక్టర్ భవాని, స్కూల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కార్యకర్తలు కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు

**చార్మినార్, జూన్ 18 ప్రభాతవార్త :**
ఏఐసిసి, టిపిసిసి తీసుకున్న నిర్ణయం ప్రకారం బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటానికి బహదూర్‌పుర నియోజకవర్గంలోని జహనుమా, రంనాస్‌పుర, నవాబ్ సాహెబ్ కుంట, దూద్‌బౌలి కిషన్‌బాగ్ డివిజన్ల కాంగ్రెస్ కమిటి సమావేశాలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు సురేష్ కుమార్, సుబ్రహ్మణ్యం సమక్షంలో సమావేశాలు జరిగాయని బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఇక్బాల్, బాను చందర్, మహ్మద్ అలీ షాన్, జ్యోతి శెట్టితో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్‌నాయకులు సయ్యద్ ఇక్బాల్, బాను చందర్, మహ్మద్ అలీషాన్, జ్యోతి శెట్టి పాల్గొన్నారు.

## కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు పంపిణీ



కరాటే విద్యార్థులకు పతకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రెండు వందల మంది యువ కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలను అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చేతుల మీదగా పంపిణీ చేశారు. బుధవారం సెయింట్ హన్నా హైస్కూల్‌లో గోల్డెన్ డ్రాగన్ కరాటే అకాడమీ సహకారంతో, వ్యవస్థాపకులు మరియు డైరెక్టర్ విక్కీ మాస్టర్ నేతృత్వంలో నిర్వహించబడింది. బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు, వేసవి శిబిరం మరియు ఖమ్మంలో జరిగిన కరాటే టోర్నమెంట్‌లలో విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు గెలుచుకుని తమ ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరై ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పోరేటర్ అమృతతో కాలసి సర్టిఫికెట్లు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, అంకితభావం కలిగి ఉండటం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెయింట్ హన్నా హైస్కూల్ కరస్పాండెంట్ సాల్మన్‌రాజ్, డైరెక్టర్ జాషువా ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 29న విజయవాడ కనక దుర్గమ్మ అమ్మ వారికి బంగారు బోనం

**చార్మినార్, జూన్ 25 ప్రభాతవార్త :** ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా ఈ నెల 29వ తేదీన విజయవాడ శ్రీ కనక దుర్గమ్మ అమ్మ వారికి బంగారు బోనం సమర్పించనున్నామని ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి చైర్మన్ జి.రాఘవేందర్ తెలిపారు. ఈనేపథ్యంలోనే విజయవాడ శ్రీ కనక దుర్గమ్మ దేవస్థానం కార్యనిర్వాహణ అధికారిని కలిసి జూన్ నెల 29వ తేదీన అమ్మవారికి బంగారు బోనం సమర్పించనున్నామని ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి చైర్మన్ జి. రఘవేందర్ ఆధ్వ ర్యంలో కమిటి ప్రతినిధులు వినతి పత్రం అందజే శారు. ఈ సందర్భం గా చైర్మన్ జి.రా ఘవేందర్ మాట్లాడు తూ సప్త మాతృకల కు సప్త బంగా రు బోనం సమర్పణ కా ర్యక్రమంలో భాగం గా జూన్ 26న గో ల్కొండ జగదాంబ అమ్మ వారికి, 29న విజయవాడ శ్రీ కనక దుర్గ అమ్మ వారికి, జూలై 2వ తేదీన బల్కంపేట ఎల్ల మ్మ తల్లికి, జూలై 4వ తేదీన జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి, జూలై 10న సికింద్రాబాద్ ఉజ్జయిని మహం కాళి అమ్మ వారి కి,15న చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారికి, జూలై 17న లాల్ దర్వాజ శ్రీ సిం హవాహినీ అమ్మ వా రికి బంగారు బోనం సమ ర్పించనున్నా మని తెలిపారు.

### మానసిక ప్రశాంతత, ఆరోగ్యాన్ని పెంచేందుకు యోగా దోహదం

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 18, ప్రభాతవార్త**
ప్రస్తుత సమాజంలో యాంత్రికమైన జీవనశైలితో ప్రతిఒక్కరూ ఒత్తిళ్ళకు గురవుతున్నారనీ మానసిక ప్రశాంతత, శారీరక పటుత్వం పెంచేందుకు యోగా దోహదపడుతుందని కూకట్పల్లి స్వచ్ఛభా రత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు పేర్కొన్నారు. 2025లో అంతర్జాతీయ యోగా దినోత్సవం యొక్క థీమ్ యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ ఉంటుందని యోగా ద్వారా మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను, భారతీయుల జీవిన విధానాన్ని ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకొచ్చిందనీ భారత ప్రధాని నరేంద్ర మోడీ స్పూర్తితో ప్రతి సంవత్సరం కూకట్పల్లి స్వ ఛభారత్ అభియాన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యోగా వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

### ఆర్టీసి బిసిల మహాసభను విజయవంతం చేయాలి

**కంటోన్మెంట్, జూన్ 18 ప్రభాతవార్తః**
ఈ నెల 24వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుపతల పెట్టిన ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 8వ మహాసభ పోస్టర్‌ను హైదరాబాద్ జోన్ గౌరవ అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. బుధవారం జూబ్లీబస్ స్టేషన్ వద్ద జరిగిన ఆర్టీసీ ఉద్యోగుల సమావేశంలో ఈ మేరకు పోస్టర్ ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ లందరు ఐక్యంగా సంఘటితం అయినప్పుడే హక్కులను సాధించికోవడం సులభ తరం అవుతుందని, కాబట్టి ఈ నెల 24న జరుపతలపెట్టిన మహాసభకు తోటి ఉద్యోగులను తరలించడంలో నాయకులు ముం దుండి బాధ్యత వహించే నప్పుడే సభ విజవంతం అవుతుందని ఆయన వివరించారు.



మంత్రి వివేక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న హరికృష్ణ

## మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన హరికృష్ణ

**సిద్దిపేట రూరల్, జూన్ 18, ప్రభాతవార్త :** బుధవారం మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు తీసుకున్న గడ్డం వివేక్‌ను కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ పూజాల హరికృష్ణ హైదరాబాద్‌లోని సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా ఆయనకు పుష్పగుచ్చాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ దుబ్బాకనియోజకవర్గ ఇన్‌చార్జీ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

## ఎసిపిని కలిసిన వ్యాయామ ఉపాధ్యాయులు



ఎసిపిని సత్కరిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

**హుస్నాబాద్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త :** హుస్నాబాద్ ఎసిపిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సదానందంను బుధవారం వ్యాయామ ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బాలుర పాఠశాలలో నిర్వహించే కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. ఎసిపిని కలిసినవారిలో ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసుదేవరెడ్డి, పిడిలు కె.రాజారెడ్డి, శ్రీనివాస్, సంపత్, కళావతి, భాగ్య, శీల, శ్రీలత, ఫర్జానా, మహేష్, పిఈటిలు ఉన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**సిద్దిపేట అర్బన్, జూన్ 18, ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని ఆ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. బుధవారం పట్టణంలో ప్రభుత్వం రైతుభరోసా నిధులు రైతుల అకౌంట్‌లలో జమచేయడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే వెనక్కి తీసుకోదని, ప్రజా సంక్షేమానికి పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీనే మరో పదేళ్ల అధికారంలోకి రావడం ఖాయం అని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ అలంకుంట మహేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, యువజన కాంగ్రెస్ పట్టణఅధ్యక్షుడు గయాజుద్దిన్, నాయకులు గయాజుద్దిన్, హర్షద్, సలీం, ఫయాజ్, అనిల్, విజ్ఞేష్, చందు, సుధీర్, నజ్జు పాల్గొన్నారు.

## సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి : ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ తోట మహేష్

**హుస్నాబాద్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త :** ప్రజల రక్షణే తమ బాధ్యత అని ఎస్ఐ తోట మహేష్ అన్నారు. బుధవారం మండలంలోని రాములపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు, పార్టీల నాయకులు గొడవలు పెట్టుకోవద్దని శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించుకోవాలన్నారు. అలాగే నేరాల నియంత్రణకు సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించాలన్నారు. అంతేకాకుండా ప్రతీ ఒక్కరు సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలని సూచించారు. ఒకవేళ సైబర్ నేరాలకి గురైతే వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ప్రజలకు సేవలు అందించేందుకు పోలీస్‌శాఖ ఎప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### హుస్నాబాద్ ఎసిపి సదానందం

**అక్కన్నపేట, జూన్ 18, ప్రభాతవార్త :** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ ఎసిపి సదానందం అన్నారు. బుధవారం రోజున అక్కన్నపేట మండల కేంద్రాన్ని హుస్నాబాద్ సీఐ కొండ్ర శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో శాంతి భద్రతలకు ఆటంకాలు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమమే పోలీసుల ధ్యేయం అని ప్రజలు సమస్యలలో ఉన్నప్పుడు ఎప్పుడైనా పోలీసుల సహకారం పొందవచ్చన్నారు. మండల కేంద్రంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగినా, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో అక్కన్నపేట ఎస్ఐ విజయ్ భాస్కర్‌తో పాటు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎసిపి సదానందం

# నీరుగారిపోతున్న రాజీవ్ యువ వికాస పథకం



**జహీరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రవేశపెట్టిన రాజీవ్‌యువ వికాస పథకం ప్రభుత్వ నిర్లక్ష్యంతో నీరుగారి పోతోందని బిఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నామ రవికిరణ్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2 లక్షలమంది లబ్దిదారులను ప్రకటించి పతకం మంజూరు పత్రాలను అందచేస్తామని ప్రకటించి అమలుచేయడంలో పూర్తిగా విఫలం అయ్యారని ఆరోపించారు. 16లక్షల మంది యువత పథకం మంజూరుకు నమోదు చేసుకున్నారని, నమోదు చేసుకునేందుకు ప్రతి ఒక్కరు 2 నుంచి 3వందల రూపాయల వరకు ఖర్చు చేసుకోవడంతో ప్రభుత్వానికి 30 కోట్ల వరకు ఆదాయం సమకూరిందని, నిరుద్యోగులకు మాత్రం నిరాశే మిగిలిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని యువకులను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత వరకు ఒక ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేకపోయిందని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ హయాంలో విడుదలచేసిన నోటిఫికేషన్‌ల ద్వారానే ఉద్యోగాలు సమకూరాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, బిఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షులు రాకేష్, బిఆర్ఎస్‌వి పట్టణ అధ్యక్షులు ఓంకార్ మడివాళ్, నాయకులు అప్పిరాజుప, ఫయాజ్, ప్రవీణ్, చింటూ, రాజా తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడా పోటీలో ఇద్దరు విద్యార్థుల ఎంపిక

**నర్సాపూర్ జూన్ 18, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం మండల విద్యాధికారి తారాసింగ్ ఆధ్వర్యంలో క్రీడా పాఠశాలకు మండల స్థాయిలో క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడా పాఠశాలకు మండల స్థాయిలో మండల పరిధిలో ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం జరిగింది. ఈ మేరకు నర్సాపూర్ లోని విష్ణు హై స్కూల్ చెందిన విద్యార్థి టి.హాసిని, మండల పరిధిలోని కాజీపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థిని జె.నందిక ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ తారాసింగ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని ఎంఈఓ తారా సింగ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీజీహెచ్ఎం చంద్రశేఖర్, పిడి ఆంజనేయులు, ఎంఐసి కోఆర్డినేటర్ సుధాకర్ గౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కొండపోచమ్మ జలాశయం లోపలికి ప్రవేశం నిషేధం

### -ఎస్ఐ విజయ్‌కుమార్

**ములుగు, జూన్ 18 (ప్రభాతవార్త):** ప్రజల ప్రాణాల భద్రత దృష్ట్యా కొండపోచమ్మ జలాశయం లోపలికి ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందని ఈ విషయాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు, పర్యాటకులు గమనించాలని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం కొండపోచమ్మ జలాశయం ప్రవేశాన్ని పూర్తిగా నిషేధిస్తూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామని, ముఖ్యంగా రిజర్వాయర్‌లోకి దిగడం, స్నానాలు చేయడం, పడవ ప్రయాణాలు, వినోద కార్యక్రమాలు పూర్తిగా నిషేధించబడ్డాయని తెలిపారు. రిజర్వాయర్ చుట్టూ నిషేధమని బోర్డులు ఏర్పాటు చేశామని, అలాంటి స్థలాలకు దిగడం చట్ట విరుద్ధమని, రిజర్వాయర్ లోతు ఉండడం వల్ల ఇందులో ఇప్పటికే ఎందరో మృత్యువాత పడడం వల్ల ఈ చర్యలు తీసుకోవల్సి వచ్చిందని, ఇది అందరూ గమనించాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా రిజర్వాయర్‌లోకి దిగితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా జలాశయంపై అనుమానాస్పదంగా సంచరించినా లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

## జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

**మర్కుక్, జూన్ 18 (ప్రభాతవార్త):** జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ నాలుగవ తరగతిలో ప్రవేశం కోసం మండలస్థాయిలో పాములపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించగా ఇందులో నలుగురు విద్యార్థులు హాజరు కాగా ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాధికారి వెంకట రాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లతిసైద, ఫిజికల్ డైరెక్టర్ రజినిలు తెలిపారు. జిల్లా స్థాయిలో ఈనెల 24న ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, మండల రిసోర్స్ పర్సన్ నాయక్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

# పెట్టుబడులకు వేళాయే

### రుణాల అన్వేషణలో రైతన్నలు

**సంగారెడ్డి మున్సిపాలిటీ జూన్ 18, ప్రభాతవార్త :** మృగశిరకార్తె ప్రవేశించిందంటే వలు పనులకు శ్రీకారం చుడుతూ పెట్టుబడులకు దారులు తెరుచుకుంటాయి. ఈనెల 3న మృగశిరకార్తె ప్రవేశించింది. వాతావరణము చల్లబడింది. రైతులు వానాకాలం వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. దుక్కులు దున్నటం ప్రారంభించారు. జీలుగ విత్తనాలు చల్లారు. ఈ నెలాఖరు నాటికి వ్యవసాయ పనులు మరింత పుంజుకుంటాయి. ఇక రైతులు పంటల సాగుకు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఎక్కువగా వ్యవసాయ పంట పెడుతుంటారు. ఇప్పటికి వ్యవసాయ భావులు, బోర్ల కింద పంటలు వేసే రైతులు పెట్టుబడులు కొరకు అన్వేషణలు ప్రారంభించారు. వేసవి సెలవుల అనంతరం ఈనెల 12న పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ప్రైవేటు విద్యా సంస్థల్లో పిల్లలను చేర్చాలంటే తల్లితండ్రులు పెద్ద పెట్టుబడి పెట్టక తప్పదు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల మోత మోగుతుంది. అయినప్పటికి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో నేర్పించేదుకు ఆసక్తి చూపడంతో పుస్తకాలు, బ్యాగులు యూనిఫామ్ తదితరవాటితో తడిసి మోపెడు అవుతున్నాయి అవుతున్నాయి. ప్రభుత్వము ప్రభుత్వ పాఠశాలల ఒలోపేతానికి అన్ని చర్యలు తీసుకుటుంది. ఆంగ్ల మాధ్యమంలో నిత్యాబోరన పాఠశాల మధ్యాహ్న, భోజనం, యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు ఉచితంగా. అందచేస్తున్నారు. ఏ మాత్రం పెట్టుబడు లేకుండా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకో వచ్చు. కానీ ప్రైవేటు పాఠశాల మోజులో జాయిన్ అవ్వతుండడంతో తల్లి దండ్రులకు ప్రైవేట్ పాఠశాలల ఖర్చులు, ఫీజులు చెల్లింపు తలకు మించిన భారంగా తయారయింది. పాఠశాలల ఖర్చులు వ్యవసాయ పెట్టుబడులు రెండు ఒకటేసారి రావడంతో కావరంతో పెట్టుబడుల కాలంగా చెప్పవచ్చు.

### తప్పుడు పత్రాలతో అనుమతులు ఇచ్చిన

## అధికారులపై చర్యలు తీసుకోవాలి

**సంగారెడ్డి మున్సిపాలిటీ జూన్ 18, ప్రభాతవార్త :** తప్పుడు పత్రాలకు ఇండ్లు లేకున్నా ఇంటి నెంబర్ లు అనుమతులు ఇస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్స హిస్తున్న సంగారెడ్డి మున్సిపల్ రెవిన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్ లోని, సి డి ఎం ఏ కి బుధవారం ఫిర్యాదు. చేసినట్లు సామాజిక కార్యకర్త ఎం శ్రీధర్. ఒక ప్రకటన లో తెలిపారు సంగారెడ్డి పట్టణం లో తప్పుడు పత్రాలు సృష్టించి మోసపూరితంగా మున్సిపల్ కార్యాలయం నుండి ఇండ్లు లేకున్నా ఇంటి నెంబర్ లు ఇస్తూ ప్రభుత్వ భూముల్లో అనుమతులు ఇస్తున్న సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం రెవిన్యూ మరియు, టౌన్ ప్లానింగ్ అధికారుల పాత్ర పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని. కోరినట్లు ఆయన తెలిపారు.

## సర్టిఫికెట్లు దొరికితే అందచేయండి

### -విద్యార్థిని మైత్రి అంబిక

**సిర్గాపూర్, జూన్ 18, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఎంసెట్‌కు ధరఖాస్తు చేసుకునేందుకు వెళ్లే తరుణంలో తనకు చెందిన సర్టిఫికెట్లు పోయినట్లు మండల పరిధిలోని గౌడ్గగామ గ్రామానికి చెందిన మైత్రి అంబిక పేర్కొన్నారు. తన సర్టిఫికెట్లు నారాయణఖేడ్‌లో లేదా సంగారెడ్డిలో పోగొట్టుకున్నానని, తన సర్టిఫికెట్లు ఎవరికై లభిస్తే 9346476726కు సమాచారం అందించాలని వినతి చేశారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**నర్సాపూర్, జూన్ 18, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి పేదల సొంతింటి కలను సాకారం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ అన్నారు. బుధవారం రెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒకటిన్నర సంవత్సర కాలంలో ఆర్థిరంగా స్థోమత లేని పూర్తిగా ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇండ్లను మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకుంటున్నారని తెలిపారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పంపిణీ చేస్తామన్న ఆ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక నిరుపేద కూడా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి పేదల సొంతింటి కలను సాకారం చేసిందన్నారు.

కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్



రెడ్డిపల్లిలో ఇళ్ల నిర్మాణానికి పనులను ప్రారంభిస్తున్న ఆంజనేయులు గౌడ్

ఈ మేరకు ఇల్లు లేని నిరుపేదలైన లబ్దిదారులు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇండ్లు నిర్మించుకొని సద్వినియోగం చేసుకోవాలని ఆంజనేయులు గౌడ్ అన్నారు.

కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేశం, రుస్తుంపేట మాజీ ఎంపీటీసీ అశోక్, రెడ్డిపల్లి గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ అశోక్ గౌడ్, దాడిగా నరేష్, శివ ప్రసాద్ గౌడ్, మన్నె శ్రీనివాస్, మహేష్, ఆంజనేయులు, అంజి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# కళనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న కళాకారులను ఆదుకోవాలి

**జగదేవ్‌పూర్, జూన్ 18 (ప్రభాతవార్త):**

రాష్ట్రంలో 30 ఏళ్ళుగా కళనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న సీనియర్ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్ అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ మండల పరిధిలోని కొండపోచమ్మ ఆలయం వద్ద తెలంగాణ రాష్ట్ర ఫోక్‌ఇండస్ట్రీ కార్యనిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వాలు చేపడుతున్న ప్రతి పథకాన్ని పాటల రూపంలో ప్రజల్లోకి తీసుకుపోవడానికి ప్రతి కళాకారుడు కీలకపాత్ర పోషిస్తున్నారని, కళనే నమ్ముకొని జీవనం సాగిస్తూ తెలంగాణ ఉద్యమంలో 20 సంవత్సరాలకు పైగా కళాకారులు ఎనలేని కృషి చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన సీనియర్ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా పాలనలో కళాకారులకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. ప్రభుత్వం ఒక్కో కళాకారునికి హైద్రాబాద్‌లో 500 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని, వడ్డీలేని రుణాలు మంజూరుచేయాలని, వృద్ధ కళాకారులకు పెన్షన్లు ఇవ్వాలని, ప్రభుత్వం ద్వారా గుర్తింపు కార్డులను ఇస్తూ ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి ఉమ్మడి జిల్లాలో కళాకారులను ప్రోత్సహించేలా ప్రతి నెలకు ఒక సభను నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సత్తార్‌బాయ్, కోశాధికారి గజ్వేల్ వేణు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిఎల్ నాందేవ్, ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర కమిటీ సలహాదారులు దరువు అంజన్న, వరంగల్ శ్రీనివాస్, జంగిరెడ్డి, కోదాడ శ్రీను, కళాంజలి రాజేష్, చీకోడు నర్సింలు, కదూరి గణేష్, వస్పరి విష్ణు, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు జడల రమేష్, శంకర్‌బాబు, మంకాల ప్రసాద్, మల్లిక్‌తేజ, నగేష్, నవీన్ సాంబారే, శ్రీధర్, ఘన్‌శ్యామ్, కోడం సంతోష్, అజయ్, మధు, మధుబాబుశాస్త్రి, చీకోటి నర్సింలు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్



డిఎల్‌పివోకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

## అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఎలా కేటాయించారు ...!?

**అక్కన్నపేట, జూన్ 18, ప్రభాతవార్త :** మండలంలోని కేశ్‌నాయక్‌తండాలో అర్హులకుకాకుండా అనర్హులకు పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారని ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హుస్నాబాద్ డివిజన్ పంచాయతీ ఆఫీసర్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉండడానికి ఇళ్లులేనివారికి ఇవ్వాల్సిన ఇందిరమ్మ ఇళ్లను కార్యదర్శి ఇల్లుతో పాటు ఆరెకరాల పొలం ఉన్న అనర్హులైన ఇద్దరికి ఇచ్చారని, వారికిచ్చిన విషయం ఇందిరమ్మ కమిటీ సభ్యులకు కూడా తెలియదన్నారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి ఇందిరమ్మ ఇండ్లలో అనర్హుల పేర్లను తొలగించి అర్హులకు కేటాయించడంతో పాటు పంచాయతీ కార్యదర్శిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కొమురవెల్లి మల్లిఖార్జున స్వామిని దర్శించుకున్న ఎసిపి




ఎసిపికి మల్లిఖార్జున స్వామి జ్ఞాపికను అందిస్తున్న అర్చకులు

**కొమురవెల్లి, జూన్ 18, ప్రభాతవార్త:** కొమురవెల్లి శ్రీమల్లిఖార్జున స్వామి వారిని బుధవారం హుస్నాబాద్ ఎసిపి సదానందం కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఎసిపిని అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలతోపాటు స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో కొమురవెల్లి ఎస్ఐ రాజుతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

### కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రవీందర్‌గౌడ్



మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

**కోహెడ, జూన్ 18, ప్రభాతవార్త :** కల్లుగీత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమండ్ చేశారు. బుధవారం నకరగొమ్ముల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన రవీందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే అర్హులైన గీత కార్మికు లకు పింఛన్లు ఇవ్వడంతో పాటు ఇచ్చిన హామీ మేరకు గ్రామాలలో బెల్ట్ షాపులు మూసివేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సారయ్య, రవిగౌడ్, బుర్ర శ్రీనివాస్, రాజయ్య, కిష్టస్వామి, రాములు, బాలయ్య పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పల్లా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

**ధూళిమిట్ట, జూన్ 18, ప్రభాతవార్త :** ఇటీవల ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోవడంతో గాయాలై సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోని ప్రజాక్షేత్రంలోకి రావాలని కోరుకుంటూ హుస్నాబాద్‌లోని శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో బీఆర్ఎస్ గిరిజన నాయకులు లకావత్ వెంకటేష్ నాయక్, ఇస్లావత్ మహేష్‌నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో పలువురు బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## రైతు భరోసా దరఖాస్తుకు ఈ నెల 20 చివరి తేది

**ధూళిమిట్ట, జూన్ 18, ప్రభాతవార్త :** నూతనంగా పట్టదారు పాసు బుక్కులు పొందిన రైతులు ఈనెల 5వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు ఈనెల 20లోగా రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో బూరెల రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రైతులు పట్టాదారు పాసుబుక్, బ్యాంక్ పాసుబుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను స్థానిక ఏఈవోలకు ఇచ్చి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## విద్యార్థులకు బుక్స్, పెన్నుల పంపిణీ

**గజ్వేల్ టౌన్, జూన్ 18 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి జన్మదినం సందర్భంగా బుధవారం గజ్వేల్ మండలం అహ్మదీపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల అధ్యాపకుడు బ్రాహ్మండ్లపల్లి బిక్షపతి, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌ల అధ్యక్షతన ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, అరీఫ్, సభ్యుల ఆధ్వర్యంలో నోటుబుక్స్, పెన్నులు, పెన్సిల్స్, వాటర్ బాటిల్స్, డ్రాయింగ్ మెటీరియల్, ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ స్నేహ అధ్యక్షుడు మల్లేశం, జోన్ చైర్మన్ నేతి శ్రీనివాస్, ఐవిఎఫ్ రాష్ట్ర బాధ్యులు తోట బిక్షపతి, గ్రామ నాయకులు రమేష్, ప్రభాకర్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్, ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్, మనం ఫౌండేషన్ మాజీ అధ్యక్షుడు ఉత్తునూరి సంపత్, ఐవిఎఫ్ జిల్లా అడ్వైజర్ దోమకొండ సతీష్, బిఆర్ఎస్ పట్టణ కోశాధికారి కొమురవెల్లి ప్రవీణ్, జిల్లా బాధ్యులు అత్తెల్లి వెంకటేష్, బాలేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## యోగ ప్రొటోకాల్‌పై అవగాహన

**రామాయంపేట, జూన్ 18, ప్రభాతవార్త :** ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో దామరచెరువు గ్రామంలో యోగ శిక్షకులు మద్దెల భరత్ ఆధ్వర్యంలో యోగ ప్రొటోకాల్‌పై అవగాహన, శిక్షణ నిర్వహించారు. సాధారణ యోగ ప్రోటోకాల్‌లోని అంశాలపై వివరించి, ధ్యానం, ప్రాణాయామం, ఆసనాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, ఆశ, అంగన్వాడి కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## వనదుర్గ భవాని మాత ఆలయానికి డోలు వితరణ

**పాపన్నపేట, జూన్ 18, ప్రభాతవార్త :**

ప్రసిద్ధ పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ భవాని మాత ఆలయానికి పాపన్నపేట మండల మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వంజరి బాలకిషన్ డోలు వితరణ చేశారు. బుధవారం ఆయన ఏడుపాయలకు చేరుకొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులకు నూతన డోలు ను అందజేశారు. వీరికి ఆలయ పూజారులు శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత

**శివ్వంపేట, జూన్18(ప్రభాతవార్త) :** మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన పెద్దపులి కిష్టయ్య, జయమ్మ దంపతులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో సీఎం సహాయ నిధి ద్వారా పెద్దపల్లి కిష్టయ్యకు రూ. 60 వేలు, జయమ్మకు 22వేల 5 వందల రూపాయల మంజూరైన చెక్కు కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు రాఘవరెడ్డి, యువ నాయకులు మురళి గౌడ్ లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రాఘవ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎం సహాయ నిధి వైద్యం కోసం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొల్ల నాగయ్య, సంద్ర లక్ష్మయ్య, బబ్బురి మల్లేష్, బుర్ర విజయ్, బుర్ర శ్రీనివాస్, బబ్బురి శ్రీనివాస్, పిల్లి మధు, తదితరులు పాల్గొన్నారు.

